సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 1 । ఆగస్టు । 2025


రాణి ఇచ్చిన స్థలంపై భూరాబంధులు 8లో


సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయండి 8లో


ప్రేమ ముసుగులో మోసం.. యువతులతో చెలగాటం 8లో

వాణిజ్యం వనితలదే!

- ఐఐఎం విశాఖ ఎంబీఏ కోర్సుల్లో రికార్డు స్థాయిలో మహిళలు
- ఈసారి ఏకంగా 52 శాతం మంది చేరిక
- మొత్తం 347 సీట్లకు గాను 181 సీట్లు అతివలకే..
- 2015లో కేవలం 10-15 శాతం మాత్రమే..
- మహిళా ప్రాధాన్యం ఎక్కువగా ఉన్న ఐఐఎంల్లో విశాఖ రెండోస్థానం


ఐఐఎం విశాఖపట్నంలో ఎంబీఏలో చేరిన మహిళలు

సాక్షి, విశాఖపట్నం : ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్–విశాఖపట్నం(ఐఐఎంవీ) విభిన్న ఆలోచనలతో ముందుకెళ్తోంది. మహాత్మాగాంధీ నేషనల్ ఫెలోషిప్ పొందిన తర్వాత ఐఐఎంలో చేరేందుకు మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. 2015లో ప్రారంభమైన తర్వాత మొదటిసారిగా ఐఐఎం విశాఖపట్నంలో ఫ్లాగ్‌షిప్ ఎంబీఏ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లో నారీశక్తి పెరిగింది. 2025–27 విద్యా సంవత్సరంలో మహిళా విద్యార్థులు పైచేయి సాధించారు. ఇటీవలే కోర్సుకు సంబంధించి ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. ఎంబీఏలో మొత్తం 347 సీట్లుండగా 181 సీట్లు మహిళా అభ్యర్థులు పొందగా.. 166 సీట్లు పురుషులకు దక్కాయి. అంటే 52.16 శాతం సీట్లు వనితలకే దక్కినట్లయింది. ఇందులో 26 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన వారున్నారు. వాణిజ్య, మానవ వనరులు, మార్కెటింగ్, తదితర రంగాల్లో రాణించేందుకు మొగ్గు చూపుతున్నారు.

దశాబ్ది కాలంలో ఇదే అత్యధికం

2015లో కోర్సులను ప్రారంభించిన తర్వాత ఐఐఎం విశాఖపట్నంలో పీజీపీ ఎంబీఏ కోర్సులో మహిళాధిక్యత పెరగడం ఇదే తొలిసారి. ఐఐఎంవీలో మిగిలిన అన్ని కోర్సుల్లో స్త్రీ–పురుషుల అడ్మిషన్ బేధం 35 నుంచి 40 శాతం ఉండేది. 2015–16లో 10 నుంచి 15 శాతం మంది మహిళలు మాత్రమే కోర్సులో చేరారు. క్రమంగా ఈ అంతరం తగ్గుతూ వస్తోంది. మహిళల్ని ప్రోత్సహించేందుకు వుమెన్ స్టార్టప్స్, సూపర్ న్యూమరీ మొదలైన అవుట్ రీచ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తోంది. అందుకే 2025–26లో 52.16 శాతం మంది మహిళల ప్రవేశాల వెనుక ఐఐఎం అధికారుల శ్రమ ఎంతో ఉంది. ఐఐఎం కోజికోట్‌లో ఫుల్‌టైమ్ పీజీపీలో 51 శాతం మంది మహిళలు చేరారు. ఐఐఎం అహ్మదాబాద్, ఐఐఎం లక్నోలో 30 శాతం మహిళలు అడ్మిషన్లు పొందారు. బాలికా విద్యకు కుటుంబాల్లో ప్రోత్సాహం పెరుగుతుండటం, రోల్‌మోడల్స్‌ను ఎంపిక చేసుకుని.. వారి లక్ష్యాలకు అనుగుణంగా అడుగులు వేయాలని మహిళల్లో సంకల్పం పెరగడం.. కార్పొరేట్ సెక్టార్‌లో పెరుగుతున్న డిమాండ్ వనితలను ఇటువైపుగా అడుగులు వేయిస్తోంది.

60 శాతం ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్

ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందిన వారిలో ఇంజనీరింగ్ విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు. మొత్తం విద్యార్థుల్లో 60 శాతం మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్ ఉండగా.. 16 శాతం మంది కామర్స్, 11 శాతం మంది మేనేజ్‌మెంట్ డిసిప్లిన్స్ అకౌంట్, 8 శాతం సైన్స్ విద్యార్థులు, 6 శాతం ఆర్ట్స్ విద్యార్థులు ఉన్నారు. ఇప్పటికే వివిధ రంగాల్లో విధులు నిర్వర్తించి.. పీజీపీ ఎంబీఏ ప్రోగ్రామ్‌లో చేరిన వారు 32 శాతం మంది ఉండటం విశేషం. ఐటీ రంగంలో ఉద్యోగాలు చేసి ఎంబీఏలో చేరిన వారు 32 శాతం మంది ఉన్నారు.

మహిళా ప్రొఫెసర్ల సంఖ్య పెరుగుతోంది



స్త్రీ, పురుషులకు సమాన అవకాశాలు కల్పించడంలో ఐఐఎం విశాఖపట్నం ముందు వరసలో ఉంది. ఈ ఏడాది తొలిసారిగా పీజీపీ అభ్యర్థుల ప్రవేశాల కోసం ప్రతి ఇంటర్వ్యూ ప్యానెల్‌లో ప్రత్యేకంగా మహిళా ఫ్యాకల్టీని నియమించాం. మహిళలను ప్రోత్సహించేందుకు అన్ని ప్రోగ్రామ్స్‌లోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఐఐఎం విశాఖపట్నంలో కోర్సులో చేరుతున్న అభ్యర్థులలోనే కాకుండా.. మహిళా ప్రొఫెసర్ల సంఖ్య కూడా పెరిగింది. గతేడాది మహిళా ఫ్యాకల్టీ 41 శాతం ఉండగా.. ఈసారి 50 శాతానికి చేరుకుంది. ఇది విద్యా విధానంలో శుభపరిణామం.

– ప్రొ.ఎం చంద్రశేఖర్, ఐఐఎంవీ డైరెక్టర్

న్యూస్‌రీల్

నేడు రెండో శ్రావణ శుక్రవారం పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దాబాగార్డెన్స్: విశాఖవాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం రెండో శుక్రవారం పూజలకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న బాపయ్యపంతులు

టీచర్స్‌కాలనీ: బ్యాంకు ఉద్యోగుల పెన్షనర్లు తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. సీబీపీఆర్వో (సెంట్రల్ బ్యాంక్ పెన్షనర్స్ అండ్ రిటైరీస్ ఆర్గనైజేషన్), ఎస్‌బీఐ పెన్షనర్ల ఫోరం సంయుక్తంగా ఈ ఆందోళనను నిర్వహించాయి. ఈ సందర్భంగా పెన్షనర్లు తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం, బ్యాంకింగ్ యాజమాన్యాల ముందుంచారు. ముఖ్యంగా, పెన్షన్ నవీకరణ తక్షణమే చేపట్టాలని, పెన్షన్, గ్రాట్యుటీ లెక్కించేటప్పుడు ప్రత్యేక భత్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎస్‌బీఐ పెన్షనర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్. బాపయ్య పంతులు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ షాహజాద్ బాషాతో తదితరులు పాల్గొన్నారు.

మారిన కోచ్‌లతో గోదావరి, రాయగడ ఎక్స్‌ప్రెస్‌లు

తాటిచెట్లపాలెం: సాధారణ, మధ్య తరగతి ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు ఏసీ కోచ్‌ల స్థానంలో జనరల్, స్లీపర్ క్లాస్ కోచ్‌లను మారుస్తున్నారు. దీనిలో భాగంగా ఆయా తేదీల నుంచి గోదావరి, రాయగడ ఎక్స్‌ప్రెస్‌లకు కూడా కోచ్‌ల కాంపోజిషన్ మారుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–హైదరాబాద్–విశాఖ (12727/28) గోదావరి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 29వ తేదీ నుంచి ఒక ఫస్ట్ క్లాస్ ఏసీ, మూడు సెకండ్ క్లాస్ ఏసీ, ఆరు థర్డ్ ఏసీ, ఆరు స్లీపర్ క్లాస్, నాలుగు జనరల్ సెకండ్ క్లాస్, ఒక సెకండ్ క్లాస్ కమ్ లగేజీ/దివ్యాంగ్ కోచ్, ఒక జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లతో నడుస్తుంది. గుంటూరు–రాయగడ–గుంటూరు (17243/ 44) ఎక్స్‌ప్రెస్ అక్టోబరు ఒకటో తేదీ నుంచి మూడు థర్డ్ క్లాస్ ఏసీ, 12–స్లీపర్ క్లాస్, మూడు జనరల్ సెకండ్ క్లాస్, రెండు సెకండ్ క్లాస్ కం లగేజీ/ దివ్యాంగ్ కోచ్‌లతో నడుస్తుంది.

కలెక్టర్‌ను కలిసిన డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు


కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కలిసిన డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు

మహారాణిపేట: జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో)గా ఎస్. వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా కలెక్టర్ ఎం.ఎస్. హరేందిర ప్రసాద్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. విజయనగరం నుంచి బదిలీపై విశాఖ వచ్చిన వెంకటేశ్వరరావు గతంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా క్రీడా అధికారిగా విధులు నిర్వహించారు. ఇక్కడ డీఎస్‌డీవోగా పనిచేసిన ఆర్. జూన్ గాలియట్‌ను ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ, విజయవాడకు స్పోర్ట్స్ ఆఫీసర్‌గా పదోన్నతిపై బదిలీ చేశారు. జూన్ గాలియట్‌తో పాటు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజార్లలో స్టాళ్లకు 4న లాటరీ

మహారాణిపేట: రైతు బజార్లలో స్టాళ్ల కోసం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో 4న లాటరీ నిర్వహించనున్నట్లు జేసీ మయూర్ అశోక్ తెలిపారు. జిల్లాలోని 71 డ్వాక్రా స్టాల్స్, 29 పీహెచ్‌సీ స్టాల్స్ కలిపి మొత్తం 100 స్టాల్స్ కోసం దరఖాస్తు చేసిన వారికి లాటరీ నిర్వహించి, స్టాల్స్ కేటాయిస్తామని పేర్కొన్నారు.

అసెంబ్లీ, మండలాలకు ప్రత్యేక అధికారులు

మహారాణిపేట : పీ4, ఇతర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడానికి అసెంబ్లీ నియోజకవర్గాలకు, మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ తెలిపారు. భీమిలి అసెంబ్లీ నియోజకవర్గానికి, భీమిలి మండలానికి ప్రత్యేక అధికారిగా ఆర్డీవో, ఆనందపురం మండలానికి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, పద్మనాభం మండలానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌హెచ్), విశాఖ రూరల్ మండలానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీని నియమించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గానికి, మహారాణిపేట మండలానికి ప్రత్యేక అధికారిగా విశాఖ ఆర్డీవోని, ఉత్తర నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిగా జిల్లా సహకార శాఖ అధికారిని నియమించారు. పశ్చిమ నియోజకవర్గానికి, గోపాలపట్నం మండలానికి ప్రత్యేక అధికారిగా జిల్లా టూరిజం అధికారి, ములగాడ మండలానికి పీడ బ్ల్యూడబ్ల్యూఈవోని నియమించారు. గాజువాక నియోజకవర్గానికి, గాజువాక మండలానికి ప్రత్యేక అధికారిగా వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ ఆఫీసర్, పెద గంట్యాడ మండలానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)ను, పెందుర్తి నియోజకవర్గ ప్రత్యేక అధికారిగా హౌసింగ్ పీడీని నియమించారు.

నేటి నుంచి గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

సబ్బవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లకు ఆసక్తి గల ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయాధికారి ఎన్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను విశాఖ జిల్లా పరిధిలోని 3 గురుకులాలు, అనకాపల్లి జిల్లాలోని 8 గురుకులాల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. తరగతి, గ్రూపుల వారీ సీట్ల వివరాలకు ఆయా కళాశాలల్లో సంప్రదించవచ్చన్నారు.

ఏయూలో తికమక పాలన

- మూడు విభాగాలకు నూతన హెచ్‌వోడీలు
- జర్నలిజం విభాగాధిపతిగా పొలిటికల్ సైన్స్ ఆచార్యుడు
- థియేటర్ ఆర్ట్స్ హెచ్‌వోడీగా ఫైన్ ఆర్ట్స్ ప్రొఫెసర్
- ఇద్దరూ సంబంధం లేని విభాగాలకు అధిపతులు



మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పాలన పక్కదారి పడుతోంది. సంబంధం లేని విభాగాలకు చెందిన ఆచార్యులను హెచ్‌వోడీలుగా నియమించడం చర్చనీయాంశమైంది. జర్నలిజంలో ఉన్న ముగ్గురు ప్రొఫెసర్లను కాదని ఇతర విభాగానికి చెందిన ఆచార్యుడిని విభాగాధిపతిగా చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఏయూలో తీసుకుంటున్న తికమక నిర్ణయాలు కారణంగా పాలన గాడి తప్పుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గురువారం ఏయూలో మూడు విభాగాలకు హెచ్‌వోడీలను నియమించారు. ఇందులో హిందీకి అదే విభాగానికి చెందిన ప్రొఫెసర్‌ను హెచ్‌వోడీగా పెట్టారు. మిగిలిన రెండు విభాగాలకు సంబంధం లేని వారిని హెచ్‌వోడీగా నియమించారు. జర్నలిజం విభాగాధిపతిగా పొలిటికల్ సైన్స్ ఆచార్యుడు పి.ప్రేమానందంకు అవకాశం కల్పించారు. వాస్తవానికి జర్నలిజం విభాగానికి ముగ్గురు సీనియర్ ఫ్యాకల్టీలు ఉన్నారు. వీరిలో ఒకరిని హెచ్‌వోడీగా నియమించే అవకాశముంది. కానీ వీరిని పక్కన పెట్టి పొలిటికల్ సైన్స్‌కు చెందిన హెచ్‌వోడీని నియమించడం గమనార్హం. అలాగే థియేటర్ ఆర్ట్స్ విభాగాధిపతిగా ఫైన్ ఆర్ట్స్ హెచ్‌వోడీ డి.సింహాచలంను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వీరిద్దరూ తమ సొంత విభాగాలకు హెచ్‌వోడీలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక విభాగంలో విభాగాధిపతిగా పనిచేస్తున్న వారిని మరో విభాగానికి హెచ్‌వోడీగా నియమించడం కూడా వివాదాస్పదమవుతోంది. అతిథి అధ్యాపకుల నియామకాలకు ఇంటర్వ్యూలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ నేపథ్యంలో హడావుడిగా ఈ నియామకాలు జరగడం వెనుక ఆంతర్యం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇది అనుచిత లబ్ధి చేయడానికా? లేదా అణిచివేయడానికా అని అతిథి అధ్యాపకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ప్రిన్సిపాల్ థియేటర్ ఆర్ట్స్, జర్నలిజానికి ఇన్‌చార్జ్ హెచ్‌వోడీగా వ్యవహరిస్తున్నారు. పనిభారం పెరిగిపోవడంతో పాటు వివిధ విభాగాలకు హెచ్‌వోడీలుగా బాధ్యతలు నిర్వహించడం ఆయనకు తలకు మించిన భారంగా మారింది. వర్సిటీ అధికారుల నుంచి కూడా సహకారం అంతంత మాత్రంగానే ఉండడంతో ప్రిన్సిపాల్ ఈ బాధ్యతల నుంచి తప్పుకోవాలనే ఉద్దేశంతో హెచ్‌వోడీల నియామకం జరిగిందని మరో వాదన వినిపిస్తోంది.

తొలి మ్యాచ్‌లో టైటాన్స్‌తో తలైవాస్ ఢీ

ఈ నెల 29 నుంచి ప్రో కబడ్డీ ప్రారంభం



విశాఖ స్పోర్ట్స్: ప్రో కబడ్డీ 12వ సీజన్ ఈ నెల 29న పోర్ట్ స్టేడియంలో ప్రారంభం కానుంది. రాత్రి 8 గంటలకు జరిగే ఆరంభ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు తమిళ తలైవాస్‌తో తలపడనుంది. ఏడేళ్ల విరామం తర్వాత విశాఖ మరోసారి ప్రో కబడ్డీ పోటీలకు ఆతిథ్యం ఇస్తోంది. ప్రస్తుత సీజన్‌లో తొలి విడత మ్యాచ్‌లు ఇక్కడే జరగనున్నాయి. తెలుగు టైటాన్స్ తమ రెండో మ్యాచ్‌ను ఈ నెల 30న యూపీ యోధాస్‌తో ఆడనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 7న బెంగాల్ వారియర్స్‌తో, 10న యు ముంబాతో విశాఖ వేదికగానే తలపడనుంది. ప్రో కబడ్డీ ప్రారంభ సీజన్‌ను తెలుగు టైటాన్స్ విశాఖపట్నం నుంచే మొదలుపెట్టింది. ఆ తర్వాత తమ హోమ్ గ్రౌండ్‌ను హైదరాబాద్‌కు మార్చింది. మధ్యలో మూడో, ఎనిమిదో సీజన్‌లకు విశాఖ ఆతిథ్యం ఇచ్చింది. ఈ సీజన్‌లో మొత్తం 12 జట్లు రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడనున్నాయి. తొలి విడత పోటీలు విశాఖపట్నంలో జరగనుండగా, తదుపరి విడత పోటీలు జైపూర్, చెన్నై, ఢిల్లీల్లో నిర్వహించనున్నారు. లీగ్ దశ ముగిసిన తర్వాత ప్లేఆఫ్ మ్యాచ్‌లు జరుగుతాయి.

అప్పన్న కొండపై రూ.10 వేలతో పెళ్లి

డెకరేషన్ మండపాల బహిరంగ వేలం నిలుపుదల



సింహాచలం: సింహాచలం దేవస్థానంలో వివాహాల నిమిత్తం డెకరేషన్ మండపాల నిర్వహణ బహిరంగవేలం ప్రక్రియను నిలుపుదల చేసినట్టు ఈవో వి.త్రినాథరావు ప్రకటించారు. ఎవరైనా ఆలయం పరిధిలో పెళ్లి చేసుకోవాలనుకుంటూ దేవస్థానానికి రూ.10 వేలు చెల్లించి, దేవస్థానం సూచించిన ప్రదేశాల్లో వివాహాలు చేసుకోవచ్చన్నారు. బయటి వ్యక్తులు/సంస్థల ద్వారా డెకరేషన్ మండపాలు, విద్యుద్దీపాలంకరణ జరిపించుకోవచ్చని పేర్కొన్నారు. వివాహ బృందాల నుంచి మండపాల కాంట్రాక్టర్ అధిక ధరలు వసూలు చేస్తుండటంతో భక్తులకు లబ్ధి చేకూర్చేందుకు డెకరేషన్ మండపాల లీజ్ విధానాన్ని నిలిపేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు ఉన్న డెకరేషన్ మండపాల నిర్వహణ కాంట్రాక్ట్ జూలై 31తో ముగిసిందన్నారు. కొండపై ఒకే సమయంలో గజపతి సత్రంలో రెండు వివాహాలకు, పాదాలమ్మ–బంగారమ్మ ఆలయాల వద్ద ఉన్న పార్కింగ్ స్థలంలో మూడు, లోవ తోట వద్ద మూడు వివాహాలకు అనుమతి ఉంటుందన్నారు. భక్తులకు అసౌకర్యం లేకుండా ఈవో అనుమతితో ఆయన సూచించిన ప్రదేశాల్లో కూడా వివాహాలు చేసుకోవచ్చన్నారు. వివాహం ముగిసిన మూడు గంటల్లోపు ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుందన్నారు. దేవస్థానానికి చెల్లించే రూ.10 వేలుకు అదనంగా రూ.5 వేలు అడ్వాన్స్ కింద చెల్లించాలని పేర్కొన్నారు. శానిటేషన్ నిర్వహణకు రూ.2 వేలు, విద్యుత్ అదనపు లోడ్ ఆధారంగా కొంత మొత్తం మినహాయించుకుని మిగిలిన మొత్తం వాపసు చేయనున్నట్లు వెల్లడించారు.

8న అప్పన్న ఆభరణాల తనిఖీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి దాతలు సమర్పించిన బంగారు, వెండి ఆభరణాలు, ఇతర విలువైన వస్తువుల తనిఖీని ఈ నెల 8న దేవదాయశాఖ ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ పరిశీలించనుంది. దేవస్థానానికి దాతలు సమర్పించిన ఆభరణాలు, విలువైన వస్తువులు రికార్డుల ప్రకారం లేవని, వాటి వివరాలను బహిర్గతం చేయాలంటూ కడప జిల్లాకు చెందిన కె.ప్రభాకరాచారి ఈ ఏడాది జనవరిలో ఫిర్యాదు చేశారు. దాంతో అప్పటి రాజమహేంద్రవరం జోన్–3 ఆర్జేసీ సుబ్బారావు ఆదేశాల మేరకు ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో దేవదాయశాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు ఆధ్వర్యంలో వచ్చిన కమిటీ రికార్డులు పరిశీలించి, నివేదిక సమర్పించింది. ఆ నివేదిక ఆధారంగా మరోసారి తనిఖీలు చేయాలని ఆర్జేసీ ఐదుగురి సభ్యులతో కూడిన కమిటీని అప్పట్లోనే నియమించారు. ఈ నేపథ్యంలోనే కమిటీ తనిఖీలు చేపట్టనుంది.

ఆ.. టీచర్లకు కూటమి ఝలక్!

- ప్రభుత్వ యాజమాన్య హైస్కూల్ హెచ్‌ఎం, ఎస్‌ఏలకు మాత్రమే ఎంఈవోలుగా అవకాశం
- రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ
- మిగిలిన యాజమాన్య టీచర్లపై వివక్ష
- ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం


తోటగరువు హైస్కూల్‌లో బోధిస్తున్న స్కూల్ అసిస్టెంట్

ఆరిలోవ: మండల విద్యాశాఖాధికారుల(ఎంఈవో) నియామకాల విషయంలో కూటమి ప్రభుత్వం జిల్లా పరిషత్, మున్సిపల్, కేజీబీవీ ఉపాధ్యాయులకు ఝలక్ ఇచ్చింది. కేవలం ప్రభుత్వ యాజమాన్యంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు(హెచ్‌ఎంలు), స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే ఎంఈవో–1 పోస్టులకు అవకాశం కల్పిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇది ఉమ్మడి సర్వీస్ నిబంధనలను ఉల్లంఘించడం, తమకు అన్యాయం చేయడమేనని జెడ్పీ, మున్సిపల్ హైస్కూళ్లు, కేజీబీవీ వంటి పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు గండి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి మండలంలో ఎంఈవో–1, ఎంఈవో–2 పోస్టులను ఏర్పాటు చేసింది. దీని కింద ఉమ్మడి విశాఖ జిల్లాలోని 46 మండలాల్లో 92 మంది ఎంఈవోలు నియమితులయ్యారు. ప్రస్తుత విశాఖ జిల్లా పరిధిలోని 11 మండలాల్లో 22 మంది విధుల్లో ఉన్నారు. అయితే కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలోని ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న హెచ్‌ఎంలు, సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే ఎంఈవో పోస్టులకు అవకాశం కల్పించారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసి, వివరాలు సేకరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయం వల్ల జెడ్పీ, మున్సిపల్, కేజీబీవీ వంటి ఇతర యాజమాన్యాల కింద పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులు పదోన్నతి అవకాశాన్ని కోల్పోతారు. 2017లో అనుసరించిన విధంగానే కామన్ సీనియార్టీ ఆధారంగా ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

జెడ్పీ, మున్సిపల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ జిల్లా ఎంపిక కమిటీ(డీఎస్సీ) ద్వారా నియమితులైనవారే. వారందరిలో సీనియార్టీ ప్రకారం హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు ఎంఈవో పోస్టులకు అర్హులు. అయినప్పటికీ కామన్ రూల్స్ పాటించకుండా కేవలం ప్రభుత్వ పాఠశాలల వారికే అవకాశం ఇవ్వడం ద్వారా ప్రభుత్వం తమపై వివక్ష చూపుతోందని ఇతర యాజమాన్య ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. కాగా.. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో పని చేస్తున్న ఎంఈవోలందరూ పూర్తిస్థాయి అదనపు బాధ్యతల(ఎఫ్‌ఏసీ) కిందనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన 297 ఉన్నత పాఠశాలలు ఉండగా, వాటిలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు కేవలం 31 మాత్రమే. ఈ 31 పాఠశాలల్లోని కొద్ది మందికి మాత్రమే ఎంఈవోలుగా అవకాశం కల్పిస్తూ.. మిగిలిన 266 పాఠశాలల్లో పని చేస్తున్న వేలాది మంది ఉపాధ్యాయులను విస్మరించడం సరికాదని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి.

జెడ్పీ టీచర్లపై ఎందుకు వివక్ష?



ప్రభుత్వ యాజమాన్యంలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఎంఈవో–1 బాధ్యతలు అప్పగించడం సరికాదు. ఇది జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులపై వివక్ష చూపడమే అవుతుంది. సర్వీస్ రూల్స్ సమస్య కారణంగా రెండు దశాబ్దాలుగా జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు వివక్షకు గురవుతున్నారు. ప్రస్తుతం గైడ్ లైన్స్ ప్రకారం ప్రభుత్వ యాజమాన్యంలోని జూనియర్లు కూడా ఎంఈవోలు అవుతారు. సీనియర్లయిన జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు మాత్రం పదోన్నతి కోల్పోతారు.

– ఇమంది పైడిరాజు, ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి, విశాఖ

అన్ని మేనేజ్‌మెంట్లకు అవకాశం కల్పించాలి



అన్ని మేనేజ్‌మెంట్లకు చెందిన ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్‌ఎంలకు, సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు ఎంఈవో–1గా అవకాశం కల్పించాలి. వారిని కూడా పూర్తిస్థాయి ఎంఈవోలుగా నియమించాలి. అలాంటప్పుడే మంచి విద్యా విధానం కొనసాగుతుంది. ఎఫ్‌ఏసీ బాధ్యతల వల్ల సక్రమంగా విధులు నిర్వహించక సరైన విద్యా ఫలితాలు రావడం లేదు. ప్రభుత్వం పునరాలోచించాలి.

– గోపీనాథ్, పీఆర్టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్

సీనియార్టీ ద్వారా భర్తీ చేయాలి



ఎంఈవో–1 పోస్టులను ఉమ్మడి సీనియార్టీ ద్వారా మాత్రమే భర్తీ చేయాలి. ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేస్తున్న హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల వివరాలు మాత్రమే సేకరించడం సరికాదు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు సంబంధించిన జీవో అమలు చేయాల్సి ఉండగా.. దాన్ని పక్కనపెట్టి ప్రభుత్వ అధికారులు పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలి.

–టి.ఆర్.అంబేడ్కర్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి, విశాఖ జిల్లా

పరిశ్రమల నిర్వహణకు పూర్తి సహకారం


మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో పరిశ్రమల నిర్వహణకు, కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ ఎం.ఎస్. హరేందిర ప్రసాద్ పారిశ్రామికవేత్తలకు హామీ ఇచ్చారు. గురువారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన డీఐఈపీసీ (డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్స్ అండ్ ప్రమోషన్ కమిటీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీఐఐసీ ద్వారా కేటాయించిన భూముల్లో నిర్వాహకులు నిర్ణీత సమయంలోనే పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆటోనగర్, ఐటీ హిల్స్ ప్రాంతాల్లో ప్రత్యేక బస్ స్టాప్‌లు ఏర్పాటు చేయాలని, ఆటోనగర్‌లో దుమ్ము, ధూళి రేగకుండా యజమానులు, అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఐలా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు.. ఐలా పరిధిలో సోలార్ యూనిట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వడ్లపూడి వద్ద ఆర్వోబీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులకు వేగంగా పరిష్కారం చూపాలని, తూనికలు కొలతలు శాఖ అధికారులు వే బ్రిడ్జిలను తనిఖీ చేయాలని చెప్పారు. పీ–4 కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు, ఫ్యాక్టరీల చీఫ్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ కుమార్, ఏపీఐఐసీ జెడ్‌ఎం సింహాచలం, పీసీబీ ఈఈ ముకుందరావు, వివిధ విభాగాల అధికారులు, పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

మహారాణిపేట: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు శుక్రవారం ఉదయం 6.30 గంటల నుంచి గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలో మొత్తం 1,56,235 మందికి వివిధ సామాజిక భద్రత పింఛన్లు రూపంలో మొత్తం రూ.69.34 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో కొత్తగా 2,524 మందికి వితంతు పింఛన్లు, కిడ్నీ వ్యాధితో వివిధ ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకున్న 19 మందికి పింఛన్లు మంజురయ్యాయని కలెక్టర్ తెలిపారు.

అతిథి అధ్యాపకుల ఇంటర్వ్యూలు ప్రారంభం



విజయనగర్ ప్యాలెస్‌లో ఇంటర్వ్యూలకు వేచి ఉన్న అతిథి అధ్యాపకులు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ) అతిథి అధ్యాపకుల ఇంటర్వ్యూల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. తొలిరోజు ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ బిజినెస్, కామర్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్, హెచ్‌ఆర్‌ఎం, బయో టెక్నాలజీ, బయో కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగాలకు సంబంధించి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ బిజినెస్, హెచ్‌ఆర్‌ఎం, కామర్స్ విభాగాలకు సంబంధించిన ఇంటర్వ్యూలు విజయనగరం ప్యాలెస్‌లో జరిగాయి. బయోటెక్నాలజీ, మ్యాథ్స్, బయో కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగాల ఇంటర్వ్యూలు ఇంజినీరింగ్ క్యాంపస్‌లోని అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహించారు. హెచ్‌వోడీతోపాటు, ఫ్యాకల్టీ చైర్మన్, ఇద్దరు సబ్జెక్ట్ నిపుణులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. తొలిరోజు ఇంటర్వ్యూల ప్రక్రియ ప్రశాంతంగా జరిగినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి.

15 నాటికి 'బంగారు కుటుంబాల' వందశాతం మ్యాపింగ్

మహారాణిపేట: ఆగస్టు 15 నాటికి 'బంగారు కుటుంబాలను' మార్గదర్శిలతో వంద శాతం మ్యాపింగ్ చేయడం జరుగుతుందని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు. గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌కు ఆయన ఈ విషయం వివరించారు. 'అన్నదాత సుఖీభవ', 'స్వర్ణాంధ్ర పీ4, నీటి వనరుల మరమ్మతులు, పునరుద్ధరణతో పాటు ఇతర అంశాలపై కలెక్టర్లతో ప్రధాన కార్యదర్శి విజయానంద్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ, వోటీపీ ద్వారా 'బంగారు కుటుంబాల' మ్యాపింగ్ ప్రక్రియ జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళికా అధికారి శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాణి ఇచ్చిన స్థలంపై భూరాబంధులు

- 1,500 గజాల స్థలం కబ్జాకు టీడీపీ కార్పొరేటర్ భర్త యత్నం
- షెడ్ల కూల్చివేతతో నిరాశ్రయులైన 15 కుటుంబాలు
- అధికారుల ఎదుటే బాధితులపై టీడీపీ నేతల దౌర్జన్యం



జెడ్సీ రాము, జనసేన ఇన్‌చార్జి పసుపులేటి ఉషా కిరణ్, ఇతర అధికారుల ముందే బాధితులతో వాగ్వాదం చేస్తున్న కార్పొరేటర భర్త చల్లా ఈశ్వరరావు

కంచరపాలెం: 'అరవై ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. మాకు రాణి గారు బతకమని ఇచ్చిన స్థలం ఇది. ఇప్పుడు ఉన్నట్టుండి వచ్చి.. మా పశువులను బయటకు గెంటేసి, షెడ్‌లను కూల్చేస్తే మేం ఎక్కడికి పోవాలి?'అంటూ జీవీఎంసీ 54వ వార్డు, బాపూజీనగర్‌కు చెందిన 15 కుటుంబాల ప్రజలు కన్నీరుమున్నీరయ్యారు. తరతరాలుగా తాము నివసిస్తున్న 1,500 గజాల స్థలాన్ని టీడీపీ కార్పొరేటర్ చల్లా రజినీ భర్త ఈశ్వరరావు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, తమకు న్యాయం చేయాలంటూ వారు మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో జరిగిన జనవాణిలో ఫిర్యాదు చేశారు. పార్టీ ఆదేశాల మేరకు జనసేన ఉత్తర ఇన్‌చార్జి పి.ఉషాకిరణ్ గురువారం అధికారులతో ఇక్కడకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. 'మా పూర్వీకులకు సుమారు 60 ఏళ్ల కిందట బిల్లా చంద్రవతి అనే రాణి జీవనోపాధి కోసం సర్వే నంబర్ 60/1బిలో ఉన్న ఈ స్థలాన్ని రాసి ఇచ్చారు. అప్పటి నుంచి ఇక్కడే చిన్న చిన్న షెడ్లు వేసుకుని, పశువులను పోషించుకుంటూ జీవిస్తున్నాం.' అని బాధితులు తెలిపారు. అయితే కొన్నేళ్లుగా ఈ స్థలంపై కన్నేసిన చల్లా ఈశ్వరరావు, ఇతర రాజకీయ నాయకులు దీన్ని ఆక్రమించుకోవాలని చూడగా, ఐక్యంగా అడ్డుకున్నట్లు చెప్పారు. కాగా.. గత సోమవారం ఎస్.వి.నాగేశ్వరరావు అనే వ్యక్తితో పాటు, రెవెన్యూ, జీవీఎంసీ సిబ్బంది, పోలీసుల భారీ బందోబస్తుతో పాటు పలువురు బయటి వ్యక్తులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. 'కోర్టులో కేసు గెలిచాం. ఈ స్థలం 18 ఏళ్ల కిందటే కార్పొరేటర్ చల్లా రజినీ పేరు మీద రిజిస్టర్ అయింది'అని చెబుతూ, అక్కడున్న పశువులను బలవంతంగా బయటకు తరలించారు. వాళ్లు నివసిస్తున్న షెడ్‌లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారు. దీంతో నిరాశ్రయులయ్యామని బాధితులు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, పంచాయితీ పెద్దల వద్ద తమ గోడు వెళ్లబోసుకుంటుండగా.. కార్పొరేటర్ భర్త చల్లా ఈశ్వరరావు వారిపై దౌర్జన్యానికి దిగి, తీవ్ర వాగ్వాదం చేశారు. దీంతో బాధితులు భయాందోళనకు గురయ్యారు. ఈ సమస్యను విన్న జనసేన ఇన్‌చార్జి తహసీల్దార్‌తో మాట్లాడి.. పూర్తి నివేదిక తెప్పించుకుని, బాధితులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. అయితే.. కూటమి ప్రభుత్వంలో భాగమైన టీడీపీ నేత దౌర్జన్యంపై.. మిత్రపక్షమైన జనసేన నాయకులు విచారణ జరిపి తీర్పు చెబుతామనడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

అధికారుల అండతో రౌడీయిజం

18 ఏళ్ల కిందట రిజిస్ట్రేషన్ చేసుకున్నామని చెబుతూ.. 18 రోజులుగా 15 కుటుంబాలను అధికారులు, పోలీసుల అండతో రౌడీలను పెట్టి రోడ్డున పడేశారు. కూటమి ప్రభుత్వంలో రౌడీయిజం ఎంతగా పెరిగిపోతోందో మా కుటుంబాలు రోడ్డున పడటమే నిదర్శనం. గతంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్‌గా ఎన్నికై.. ఇప్పుడు టీడీపీలో చేరి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి మాకు న్యాయం చేయాలి.

– బసవ అప్పలకొండ, బాధిత మహిళ

60 ఏళ్ల స్థలంపై టీడీపీ కన్ను



టీడీపీ కార్పొరేటర్ భర్త చల్లా ఈశ్వరరావు రౌడీలతో దౌర్జన్యానికి పాల్పడ్డారు. 60 ఏళ్లుగా కాపాడుకుంటూ వస్తున్న మా స్థలంపై టీడీపీ నాయకులు కన్నేశారు. ఈ స్థలాన్ని కోర్టులో గెలుచుకున్నామని చెబుతూ.. టీడీపీ నాయకుల పేరుతో రౌడీలను తీసుకొచ్చి, ఇక్కడ ఉన్న సామగ్రిని, పశువులను, మొక్కలను తొలగించి స్థలానికి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. పోలీసులను ఆశ్రయిస్తే కోర్టులో తేల్చుకోండి అంటూ రాజకీయ నాయకులకు మద్దతుగా వ్యవహరించారు. ఈ స్థలాన్ని కబ్జా చేయడానికి గతంలో కూడా రౌడీలతో బెదిరించారు.

– గుజ్జు పైడిరాజు, బాధితుడు, బాపూజీనగర్, 104 ఏరియా

గంజాయి స్మగ్లర్లపై కఠిన చర్యలు

అల్లిపురం/పీఎంపాలెం: అక్రమ గంజాయి వ్యాపారానికి పాల్పడుతున్న వారిపై అధికారులు ఉక్కుపాదం మోపారు. గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులపై ఏడాదిపాటు నిర్బంధ ఉత్తర్వులు జారీ చేయగా, మరో గంజాయి స్మగ్లర్‌పై పీడీ యాక్ట్ కింద కేసు నమోదుకు ఆదేశాలు వెలువడ్డాయి.

ఇద్దరు యువకులపై నిర్బంధ ఉత్తర్వులు

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా గురువారం ఇద్దరు యువకులపై ఏడాదిపాటు నిర్బంధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి అక్రమ కార్యకలాపాలు పలువురి ఆరోగ్యం క్షీణించడానికి కారణమవుతున్నాయని అందులో పేర్కొన్నారు. మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధి, జిల్లా పరిషత్ దరి, వేంకటేశ్వరనగర్ ప్రాంతానికి చెందిన మేడిశెట్టి వరప్రసాద్ గంజాయి రవాణా, అమ్మకాల ఆరోపణలపై ఇప్పటికే శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ మేరకు అతనిపై అడ్వైజరీ బోర్డు విచారణ చేపట్టింది. విచారణ అనంతరం, ఈ ఏడాది మే 20వ తేదీ నుంచి ఏడాది పాటు నిర్బంధం విధిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. టౌన్‌కొత్తరోడ్డు, పంజా జంక్షన్ ప్రాంతానికి చెందిన శీరం ఆకాష్ గంజాయి అక్రమ రవాణా, అమ్మకాల ఆరోపణలపై శిక్ష అనుభవిస్తున్నాడు. అతని చరిత్రను ఎక్సైజ్ అడ్వైజరీ బోర్డు పరిశీలించింది. ప్రమాదకర మాదక ద్రవ్యాల రవాణా, అమ్మకాలు చేస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా ప్రవర్తిస్తున్నాడని నిర్ధారించిన బోర్డు.. ఈ ఏడాది మే 20వ తేదీ నుంచి ఏడాదిపాటు నిర్బంధంలో ఉంచాలని ఆదేశాలు ఇచ్చింది.

ఒకరిపై పీడీ యాక్ట్ నమోదు

గంజాయి అక్రమ రవాణా వంటి చట్ట వ్యతిరేక పనులకు పాల్పడుతున్న మధురవాడ డాక్‌యార్డు కాలనీకి చెందిన పెద్దిన రవి అలియాస్ గోదాపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పీఎంపాలెం సీఐ జి. బాలకృష్ణ గురువారం తెలిపిన వివరాలివి. రవి గంజాయి అక్రమ రవాణా, మధురవాడ పరిసర ప్రాంతాల్లో చిల్లర గంజాయి అమ్మకాలు వంటి సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ పలుమార్లు పోలీసులకు చిక్కాడు. సుమారు ఆరు నెలల కిందట గంజాయి అక్రమంగా తరలిస్తూ పట్టుబడగా, ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు రవిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, మరోసారి జైలుకు పంపిస్తామని సీఐ తెలిపారు.

స్టాళ్ల కేటాయింపులో పారదర్శకత

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: జిల్లాలోని రైతుబజార్లలో డ్వాక్రా, దివ్యాంగులకు సంబంధించిన స్టాళ్ల కేటాయింపును నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తామని మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.శ్రీనివాస కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 28న 'రైతు బజార్లపై కూటమి గద్దలు'అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. జిల్లాలోని రైతుబజార్లలో డ్వాక్రా, దివ్యాంగుల కోసం కేటాయించిన 100 స్టాళ్ల గడువు ముగియడంతో.. వాటి నిర్వహణకు కొత్త లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు శ్రీనివాస కిరణ్ వివరించారు. ఈ స్టాళ్ల కోసం మొత్తం 580 దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం విశాఖ, అనకాపల్లి జిల్లాల పరిధిలోని డీఆర్‌డీఏ, జీవీఎంసీ యూసీడీ, వికలాంగుల శాఖ ఆధ్వర్యంలో దరఖాస్తుల పరిశీలన జరుగుతోందన్నారు. పరిశీలన పూర్తయిన తర్వాత, జిల్లా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో కలెక్టర్ కార్యాలయంలో లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని శ్రీనివాస కిరణ్ స్పష్టం చేశారు.

రైల్వే చీఫ్ ఇంజినీర్‌గా అమిత్ గుప్తా

విశాఖ విద్య: సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ వర్క్స్ ఇంజినీర్(సీడబ్ల్యూఈ)గా అమిత్ గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు డైరెక్టర్ రవీందర్ పాండే గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అహ్మదాబాద్ కేంద్రంగా ఉన్న రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా ఉన్న ఆయన్ని సౌత్ సెంట్రల్ రైల్వేకు బదిలీ చేశారు.

రూ.1.7 కోట్ల భూమికి ఎసరు!

- పనులు నిలుపుదల చేయించిన అధికారులు
- తప్పుడు పత్రాలతో గెడ్డ, ఖాళీ స్థలాల ఆక్రమణ



తప్పుడు పత్రాలతో పొందిన ప్లాన్

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడ ప్రాంతంలో ఇప్పటివరకూ ప్రభుత్వ భూముల ఆక్రమణలు ఎక్కువగా విన్నాం. అయితే తాజాగా వుడా ఆమోదిత లేఅవుట్‌లో ఉన్న ఖాళీ స్థలాలను, గెడ్డలను సైతం నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కొట్టేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మధురవాడ రెవెన్యూ గ్రామంలోని సర్వే నం. 281/పీ, 282/పీ, 284/పీ, 300/పీ, 302/పీ, 303/పీ, 305/పీ, 306/పీ, 610/పీ వంటి నంబర్లలో 1990 ప్రాంతంలో షిప్‌యార్డు ఉద్యోగుల కోసం బింద్రానగర్‌లో సుమారు 24.48 ఎకరాల్లో 268 ప్లాట్లతో ఒక లేఅవుట్ ఏర్పాటు చేశారు. ఇందులో రోడ్లు, పార్కులతో పాటు కాలువలు, గెడ్డలు వంటి బహిరంగ స్థలాలు కూడా ఉన్నాయి. కొందరు వ్యక్తులు ఈ ఖాళీ స్థలాలకు, గెడ్డలకు ప్లాట్ నంబర్లకు అదనంగా పీ చేర్చి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించినట్లు సమాచారం.

211పీ ప్లాట్ నంబరుతో సుమారు రూ.1.75 కోట్ల విలువైన 267 గజాల స్థలాన్ని కాజేశారు. కొందరు వ్యక్తులు ఒక వృద్ధుడిని ముందు పెట్టి ఈ నకిలీ డాక్యుమెంట్లను సృష్టించడమే కాకుండా, జీవీఎంసీ నుంచి అక్రమంగా ప్లాన్ పొంది కొద్ది రోజులుగా చకచకా నిర్మాణ పనులు కూడా మొదలుపెట్టారు. అయితే టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఈ పనులను నిలుపుదల చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

అధికారుల పాత్ర : ఈ అక్రమాల్లో ఓ జీవీఎంసీ సర్వేయర్ సహకారం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అతని సహకారంతోనే తప్పుడు సర్వే రిపోర్టులు సృష్టించి, రిజిస్ట్రేషన్ చేయించడమే కాకుండా, ప్లాన్‌ను కూడా పొందారని సమాచారం. ఈ తప్పుల్లో భాగస్వాములైన జీవీఎంసీ అధికారులు తాము ఎక్కడ బయటపడతామోనని ఆచితూచి వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఈ విషయం బయటకు రాకుండా వారు సామ, దాన, దండోపాయాలను ప్రయోగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అంతేకాదు ఈ స్థలంలో ఇలాంటి మరికొన్ని నిర్మాణాలు కూడా ఇప్పటికే పూర్తయినట్లు తెలుస్తోంది.



పనులు నిలుపుదల చేయిస్తున్న జీవీఎంసీ ప్లానింగ్ సెక్రటరీలు

బెదిరింపులకు దిగుతున్న ముఠా

ఈ అక్రమాలకు పాల్పడిన వ్యక్తులు కొందరు ముఠాగా ఏర్పడి, ఈ వ్యవహారాన్ని ఎవరైనా బయటపెడితే అంతు చూస్తామని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. పోలీసు కేసులు పెడతామని, వారు ఎంతటివారైనా వదిలిపెట్టబోమని బెదిరింపులకు దిగుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగస్వాములైన అధికారులనూ బయటకు లాగుతామంటూ ప్రచారం చేస్తున్నట్లు కూడా సమాచారం. ఈ విషయంలో ఉన్నత స్థాయి అధికారులు తక్షణమే స్పందించి, తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రేమ ముసుగులో మోసం.. యువతులతో చెలగాటం

- అమ్మాయిలను నమ్మించి, ఆపై వీడియోలతో బ్లాక్ మెయిల్
- వలపన్ని నిందితుడిని పట్టుకున్న పోలీసులు

గోపాలపట్నం: ప్రేమ పేరుతో యువతులను వలలో వేసుకోవడం, పెళ్లి చేసుకుంటానని నమ్మించి వారితో సహజీవనం చేయడం, ఆపై రహస్యంగా తీసిన వీడియోలతో బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి డబ్బులు గుంజడం అలవాటుగా మార్చుకున్న ఓ ప్రబుద్ధుడిని గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేశారు. బాధితురాలైన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్నట్లు సీఐ ఎన్.వి.ప్రభాకర్ వెల్లడించారు. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం జోగంపేట గ్రామానికి చెందిన సరమడ శ్రీను ఉద్యోగాల పేరుతో పలు ప్రాంతాలకు వెళ్తూ అక్కడ యువతులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నాడు. ఇదే క్రమంలో గోపాలపట్నానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని ప్రేమ పేరుతో నమ్మించి, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమెతో సహజీవనం ప్రారంభించాడు. శారీరకంగా కలిసిన సమయంలో రహస్యంగా వీడియోలు తీశాడు. కొంతకాలం తర్వాత తన అసలు స్వరూపం బయటపెట్టి, ఆ వీడియోలను అడ్డుపెట్టుకుని ఆమెను బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తీవ్రంగా వేధించాడు. ఆ వేధింపులు భరించలేక బాధితురాలు ధైర్యం చేసి పోలీసులను ఆశ్రయించింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడు శ్రీనును పట్టుకోవడానికి ప్రయత్నించారు. ఫోన్ ద్వారా సంప్రదించినా స్పందించకపోవడం, సాంకేతిక ఆధారాలతో కూడా చిక్కకపోవడంతో.. పోలీసులు పక్కా పథకం వేశారు. బాధితురాలి ఫోన్ నుంచే శ్రీనుకు మెసేజ్ పంపించి, నిర్దిష్ట ప్రదేశానికి రప్పించారు. ఆ ప్రదేశానికి శ్రీను రాగానే.. అప్పటికే అక్కడ మాటువేసిన పోలీసులు అతడిని వలపన్ని పట్టుకున్నారు.

విచారణలో విస్తుపోయే నిజాలు

పోలీసుల విచారణలో శ్రీను నేర చరిత్ర వెలుగులోకి వచ్చింది. అతను అమ్మాయిల కోసమే ఉద్యోగాల్లో చేరతాడు. ఇలా చాలా మంది యువతుల జీవితాలతో ఆడుకున్నట్లు తేలింది. గతంలో గోపాలపట్నంలో లక్ష్మీనగర్‌లో ఓ యువతిని ప్రేమించగా, విషయం ఇంట్లో తెలియడంతో ఆమె కుటుంబ సభ్యులు అతనికిచ్చి బలవంతంగా పెళ్లి చేశారు. కానీ కొన్నాళ్లకే శ్రీను మరో అమ్మాయితో సంబంధం పెట్టుకోవడంతో, అతని భార్య విడిచిపెట్టి వెళ్లిపోయింది. నిందితుడిపై గతంలో రెండో పట్టణ, గోపాలపట్నం పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. శ్రీను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

యువతులకు పోలీసుల హెచ్చరిక

ఈ సందర్భంగా సీఐ ప్రభాకర్ మాట్లాడుతూ యువతులు ఇలాంటి మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. 'ప్రేమ పేరుతో మోసం చేసేవారు మన చుట్టూనే ఉంటారు. వారి ప్రవర్తన, తీరును గమనిస్తే దురుద్దేశం అర్థమవుతుంది. కేవలం శారీరక సుఖం కోసం వెంపర్లాడే వారిని దరిచేరనివ్వద్దు. వారి వల్ల భవిష్యత్తు అంధకారమవుతుంది' అని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ, వారి బాగోగులను గమనించాలని సూచించారు. ఇంట్లో ప్రేమపూర్వక వాతావరణం ఉంటే పిల్లలు బయటి వ్యక్తుల ఆకర్షణలకు లోనుకారని సీఐ తెలిపారు.

సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయండి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్ : ఒప్పందం ప్రకారం నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఇంజనీరింగ్ విభాగ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్లు కూడా భాగస్వాములేనని, ప్రతి కాంట్రాక్టర్ వారికిచ్చిన పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. టెండర్ కాల్ ఫర్ చేసినప్పటి నుంచి పనులు పూర్తయ్యే వరకు పనుల్లో ఎటువంటి జాప్యం ఉండరాదని ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు. సచివాలయ పరిధిలో రెండు/మూడు వర్క్స్ ఉంటాయని, వార్డు ఎమినిటీ కార్యదర్శులను భాగస్వామ్యం చేస్తూ ప్రతిరోజూ ఆయా పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు. పనుల్లో సమస్యలుంటే జోనల్ కమిషనర్ లేదా పై అధికారులకు తెలియజేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు వారి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎప్పటి నుంచో ఉన్న ఈఎండీలను వెంటనే జారీ చేయాలని కోరారు. పనులు చేసిన అనంతరం బిల్లుల ప్రక్రియకు వచ్చేసరికి బడ్జెట్ లేదని, ఆ బిల్లును మళ్లీ బిల్లు జనరేట్ అయ్యే వరకు ఆపుతున్నందున చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వాటిని పరిశీలించాలని అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మను కమిషనర్ ఆదేశించారు. సమీక్షలో పర్యవేక్షక ఇంజనీర్లు కేవీఎస్ రవి, పీవీవీ సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, జీవీఎంసీ కాంట్రాక్ట్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.సంజీవరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్దాల రమేష్, కాంట్రాక్టర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గొంప చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు సాధూరావు, సభ్యులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

రేపు అన్నదాత సుఖీభవ ప్రారంభం

మహారాణిపేట: జిల్లాలో ఈ నెల 2న అన్నదాత సుఖీభవ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంపై గురువారం సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ హరేందిర ప్రసాద్‌తో పాటు జేసీ కె.మయూర్ అశోక్, ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి అప్పలస్వామి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకం వర్తించేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో పండగ వాతావరణంలో నిర్వహించాలన్నారు.

అత్యుత్తమ ఫీచర్లతో వివో సరికొత్త ఫోన్లు



సరికొత్త ఎక్స్ 200, ఎక్స్ ఫోల్డ్5 ఫోన్లను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఏయూక్యాంపస్: అత్యుత్తమ ఫీచర్లతో కూడిన సరికొత్త మొబైల్ ఫోన్‌లను వివో.. మార్కెట్లోకి విడుదల చేసింది. బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో వివో తమ కొత్త ఎక్స్ 200 ఎఫ్ఈ, ఎక్స్ ఫోల్డ్ 5 మోడళ్లను ఆవిష్కరించింది. సెల్ పాయింట్ ఎండీ మోహన్ ప్రసాద్ పాండే, డైరెక్టర్ బాలాజీ పాండేలతో కలిసి వివో ప్రతినిధి మీర్ మెహిద్ వీటిని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి నటి సౌమ్య రావు, మోడల్ అంకిత ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివో ప్రతినిధి మీర్ మెహిద్ మాట్లాడుతూ వినియోగదారులే తమ సంస్థకు అత్యంత ప్రధానమన్నారు. సెల్ పాయింట్ తమకు కీలక భాగస్వామిగా నిలుస్తోందని వెల్లడించారు. సెల్ పాయింట్ ఎండీ మోహన్ ప్రసాద్ పాండే మాట్లాడుతూ దశాబ్ద కాలంగా వివోతో తమ అనుబంధం కొనసాగుతోందన్నారు. వివో అత్యుత్తమ సేవలతో వినియోగదారుల అభిమానాన్ని చూరగొంటుందని ప్రశంసించారు. ప్రారంభ ఆఫర్‌లో భాగంగా వివిధ క్రెడిట్ కార్డులపై డిస్కౌంట్లు, నో కాస్ట్ ఈఎంఐ, జీరో డౌన్ పేమెంట్ వంటి సదుపాయాలను కల్పిస్తున్నట్లు వెల్లడించారు. వి డ్రీమ్ డీజీఎం వసంత్ రెడ్డి మాట్లాడుతూ సెల్ పాయింట్‌తో బలమైన అనుబంధం ఉందన్నారు. సీనియర్ ఆర్ఎం ఈశ్వర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివోకు 15 మిలియన్ల మంది వినియోగదారులు ఉన్నారని తెలిపారు. అత్యుత్తమ కెమెరా ఫీచర్లతో ఫోన్లు అందుబాటులో ఉంచామని వివరించారు. కార్యక్రమంలో ఏజీఎం సతీష్, ఏపీ సేల్స్ హెడ్ షేక్ ఆజాద్, సెల్ పాయింట్ ఏఎస్ఎంలు గోవింద్, వెంకటేష్, దినేష్ పాండే తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతికి జై





వినాయక చవితి సమీపిస్తుండటంతో నగరంలో సందడి వాతావరణం నెలకొంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన కళాకారులు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసుకుని, బొజ్జ గణపతి విగ్రహాలకు జీవం పోస్తున్నారు. పర్యావరణ హితమైన మట్టితో, కనులపండువ చేసే అనేక ఆకృతుల్లో గణపతులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. నగరంలోని లాసెన్స్ బే కాలనీలో ఏర్పాటు చేసిన శిబిరంలో మట్టితో రూపుదిద్దుకుంటున్న ఈ గజానన విగ్రహాలను ఇక్కడ చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



